ప్రజాశక్తి
శుక్రవారం 6 డిసెంబర్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కట్టు కథలు

- అనుమతుల్లేని ఔషధం తయారీ
- కళ్లు మూసుకున్న ఔషధ నియంత్రణ విభాగం
- దాగూర్ ఫార్మా ప్రమాదంపై వీడని మౌనం
- వాస్తవాలు దాచిపెడుతున్నారని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' విమర్శ



దాగూర్ లేబొరేటరీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని దాగూర్ ఫార్మా యాజమాన్యాన్ని ప్రభుత్వ యంత్రాంగం వెనుకేసుకొస్తోంది. రెండు నిండు ప్రాణాలు పోవడానికి, 27 మంది అస్వస్థతకు గురికావడానికి మూలమైన ఫార్మా యాజమాన్యంపై కఠిన చర్యలేమీ తీసుకోలేదు. ప్రమాదంపై యాజమాన్యం చెప్పిన కట్టుకథలే వినిపిస్తున్నారు తప్ప ప్రమాదానికి దారితీసిన వాస్తవాలు వెల్లడించడంలేదు. అనుమతుల్లేకుండా ఉత్పత్తుల తయారీపై కాలుష్య నియంత్రణ మండలి, ఔషధ నియంత్రణ విభాగం మౌనం ప్రదర్శిస్తున్నాయి. ప్రమాదనంతరమే ఔషధ పరిశ్రమల లోగుట్టు బయటపడుతున్నట్లే.. దాగూర్ ఉల్లంఘనలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. భద్రతనే కాదు, కొత్త ఉత్పత్తుల తయారీకి పాటించాల్సిన ప్రమాణాలు, నిబంధనలు కూడా పరిశ్రమాధిపతులు విస్మరిస్తున్నారు. లామివుడిన్ తయారీపై ఫ్యాక్టరీస్ అధికారుల దృష్టికి యాజమాన్యం తీసుకెళ్లలేదు. కొత్త డ్రగ్ తయారీపై ముందుగా ఈ విభాగానికి తెలియజేయాలన్న నిబంధన పాటించలేదు. ప్రమాదంపై కూడా సమాచారం సరిగా చెప్పలేదు. లామివుడిన్ ఉత్పత్తి చేస్తున్నట్లు బయటపడింది. అక్టోబర్‌లో దాగూర్ పరిశ్రమలో తనిఖీ అధికారుల బృందం పరిశీలించినప్పుడు అనేక లోపాలు గుర్తించింది. రియాక్టర్లకు ఎస్ఆర్‌విలు, రప్చర్ డిస్క్‌లు వంటి రిలీఫ్ సిస్టమ్స్ ఏర్పాటుచేయాలని సూచించినా యాజమాన్యం పట్టించుకోలేదు. స్క్రబ్బర్ ఏర్పాటుచేస్తే ఒత్తిడికి లోనైన సందర్భంలో ప్రమాదాన్ని నియంత్రించవచ్చని డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ తెలిపారు.

దాగూర్ ఫార్మా ప్రమాదంపై ఔషధ నియంత్రణ విభాగం తమకేమీ సంబంధంలేనట్లు వుండడం విమర్శలకు తావిస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ అధికారులు ప్రమాదంపై భిన్నమైన కారణాలు చెప్పడంతో అనుమానాలకు తావిచ్చింది. వాస్తవాలు దాచిపెడుతున్నారన్న అభిప్రాయం కలిగింది. ప్రమాదంపై తప్పుదోవ పట్టిస్తున్నారని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' ప్రతినిధి డాక్టర్ కె.బాబూరావు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి కె.అనురాధ ప్రకటన జారీచేశారు. తరువాత ప్రమాదంపై పరిశీలన చేసినట్లు అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితిని ఔషధ నియంత్రణ విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ అధికారులు సంయుక్తంగాగానీ, వేర్వేరుగాగానీ తమ నివేదికల్లో బహిర్గతం చేయలేదు.

తాజాగా 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' బృందం ప్రతినిధులు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ ఎం.బాపూజీ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదం తరువాత ఫ్యాక్టరీ అధికారులూ, పిసిబి అధికారులు రియాక్టర్లలో వున్న మిశ్రమ నమూనా తీసుకొని పరిశీలించలేదు. లామివుడిన్ మిగతా 2లో..



సిఎం చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

సిఎంకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఎం నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం 7:30 గంటలకు ముంబయి నుంచి బయలుదేరి 9 గంటలకు విశాఖపట్నం చేరుకున్నారు ఆయనకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, జిసిసి ఎమ్‌డి కల్పనాకుమారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, డిసిపి-2 మేరీ ప్రశాంతి, విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టితో పాటు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ గోపాల్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి నాయకులు సీతంరాజు సుధాకర్, గండి బాబ్జీ తదితరులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో చంద్రబాబు రాంనగర్‌లోని ఎన్‌టిఆర్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం నోవాటెల్ హోటల్‌లో జరగనున్న కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు విఎంఆర్‌డిఎకు సంబంధించిన సమీక్షలో కూడా పాల్గొంటారని అధికారులు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వార్త 7లో..

జివిఎంసి కౌన్సిల్ అంశాలపై సమీక్ష

వార్త 2లో..

నేడు విశాఖలో 'డీప్ టెక్ మీట్ - 2024'

వార్త మెయిన్‌లో..

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం



సమ్మేళనం వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కేంద్రంగా 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం బీచ్ రోడ్‌లోని వైఎంసిఎలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని గీతం యూనివర్సిటీ వేదికగా ఈ నెల ఆరు నుండి 12వ తేదీ వరకు జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని పలు జిల్లాలకు చెందిన 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటారని చెప్పారు. వారం రోజులపాటు జరిగే ఈ గిరిజన యువ సమ్మేళనంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ప్రధానంగా గిరిజన సంస్కృతి, ఆచారపు అలవాట్లు, భాష, విద్య,, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయని ఆయన వివరించారు.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ సహకారాలతో కేంద్ర యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ద్వారా ఈ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి

విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ ఏడాది సెప్టెంబర్ 27న జరిగిన వేతన ఒప్పందాన్ని తక్షణం అమలు చేయాలని విశాఖ పోర్టులోని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పోర్టు ఎఒబి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి కె.సత్యనారాయణ, విశాఖ హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, విశాఖ పోర్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ఎంఎస్) కార్యదర్శి మంగయ్య నాయుడు, పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఎఫ్‌టియుఐ) అధ్యక్షులు ఎన్.కనకారావు, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టియుసి) ప్రధాన కార్యదర్శి జి.చందు, బిఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ వేతన ఒప్పందం జరిగి



పోర్టు ఎఒబి వద్ద ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

మూడు మాసాలు పూర్తయినప్పటికీ అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. పెన్షనర్స్, కుటుంబ పెన్షనర్స్‌కి చట్టబద్ధమైన ప్రయోజనాలు అమలు చేయాలన్నారు. పోర్ట్ హాస్పిటల్‌ను ప్రైవేటీకరణ చేయరాదని గత రెండు నెలలుగా పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటు వారికి ఇవ్వాలని పిలిచిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కట్టు కథలు

ఉత్పత్తి మూడో దశలో ప్రమాదం జరిగినట్లు ఫ్యాక్టరీస్ విభాగం తెలిపిందిగానీ ఏ విషవాయువో వివరించలేదు. పాంటోప్రజోల్ ఉత్పత్తి మూడో దశలో ప్రమాదం జరిగినట్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెప్పారు. క్లోరిన్ వాయువు అని చెబుతున్నారు. క్లోరిన్ వాసన సులువుగా గుర్తించవచ్చు. 0.02-3.4 పిపిఎం స్థాయిలో వాసన తెలుస్తుంది. క్లోరిన్ బయటకు వస్తున్నప్పుడు కార్మికులు బయటకు వెళ్లకుండా వుండరు కదా ? అని ప్రశ్నించారు. అసలు క్లోరిన్ ఎందుకు వచ్చింది ? పిసిబి అధికారులు క్లోరిన్ అని నిర్ధారణకు ఎలా వచ్చారు ? ఇదంతా కల్పిత కథలా వుంది. ఆ సమయంలో కంపెనీ డైరెక్టర్లు అక్కడ ఎందుకున్నారు ? క్లోరిన్ వాసన గుర్తించి జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదు. అనుమతిలేని కొత్త ఉత్పత్తి ప్రయత్నంలో జరిగిన ప్రమాదాన్ని కప్పిపుచ్చడానికి జరుగుతున్న ప్రయత్నంగా ఇదంతా వుంది. అధికారులు అందుకు సాధనంగా ఉపయోగపడుతున్నారు' అని వ్యాఖ్యానించారు.

లోపాలను ఫ్యాక్టరీస్ అధికారులు గుర్తించి సరిచేయాలని సూచించినప్పటికీ మళ్లీ స్వతంత్రంగా వెళ్లి పరిశీలించే అధికారం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆ అవకాశం అధికారులకు లేకుండాపోయింది. పరిశ్రమల్లో భద్రత, ప్రమాణాల పరిశీలనకు ప్రభుత్వ విధానాలు అధికారులకు విఘాతం కల్గిస్తున్నాయి. పరిశ్రమల్లో భద్రత, ఉత్పత్తులు, కాలుష్య ప్రమాణాలపై ఆయా విభాగాల తనిఖీలకు ఆటంకంగా మారిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలోని అంశాలను ప్రభుత్వం తొలగించాల్సివుంది. ప్రమాదానికి కారణమైన, అనుమతుల్లేకుండా మందులు తయారుచేసిన ఠాగూర్ పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ తరహా ఔషధ పరిశ్రమలను గుర్తించి బయట పెట్టాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి

పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ అయితే ఉద్యోగులకు, కార్మికులకు ఆరోగ్య భద్రత ఉండదన్నారు. ఆసుపత్రికి ఉన్న ఆరు ఎకరాల భూమిని కొట్టేయాలనే ఉద్దేశంతో ప్రైవేటీకరణ ప్రక్రియ జరుగుతోందని విమర్శించారు. 40 వేల మంది ఉద్యోగులు, కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆర్గనైజింగ్ కార్యదర్శి రామలింగ స్వామి, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు, అధ్యక్షులు జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎంఎస్ఎంఇ మార్కెటింగ్‌పై సదస్సు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ఎంఎస్ఎంఇ మార్కెటింగ్‌కు సంబంధించి ప్రొక్యూర్మెంట్, వెండర్ డెవలప్‌మెంట్ సదస్సు గీతం విశ్వవిద్యాలయంలో శుక్ర, శని వారాలలో జరుగుతుందని జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎపి ఎంఎస్ఎంఇ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, విసి, ఎండి ఎపిఐఐసి ఎం.అభిషిక్త కిశోర్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యంగా తయారీ, ఆటోమొబైల్, ఆహార శుద్ధి, స్టీల్, అల్లాయ్స్, రక్షణ రంగాలలో తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఆసక్తి ఉన్న ఎంఎస్ఎంఈ లు ఉచితంగా స్టాల్స్ పొందవచ్చు అన్నారు. ఈ అవకాశమును సద్వినియోగ పరుచు కోవలసిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం చందన్ సెల్ 9985400782 నెంబర్ లో సంప్రదించాలన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

అక్రమంగా తరలిపోతున్న బియ్యాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ నుంచి తరలి పోతున్న బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని గంగవరం పోర్టులోకి వెళ్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపించాలని దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు విజ్ఞప్తి చేసారు. గురువారం ఆయన దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్ కు వినత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ, పేద ప్రజలకోసం రాష్ట్రం సుమారుగా రూ.5,500 కోట్లతో బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారన్నారు. దానికి ట్రాన్స్పోర్టు ఖర్చులు, వాహనాల ఖర్చులు ఇతరత్రా ఖర్చులతో కలపగా దాదాపు రూ.1,550 కోట్లు ఖర్చు అవుతోందని తెలిపారు. నిరుపేదలకు ఇస్తున్నటువంటి బియ్యం ఉపయోగకరగా లేదన్నారు. ఈ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు,ఇతర దేశానికి ఈ మాఫియా అమ్ముకుని కోట్లాది రూపాయలు వెనుకేసుకుంటుందన్నారు.రూ.38 లకు కొనుగోలు చేస్తున్న ఈ బియ్యం బదులు కార్డుదారులకు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లోకి డబ్బులు వేస్తే వారికి నచ్చిన బియ్యాన్ని కొనుగోలు చేసుకుంటారని అన్నారు.దీంతో రూ.1,550 కోట్ల రూపాయిల ఖర్చులు కూడా తగ్గుతాయని అన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



సిఎం పర్యటన మార్గంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు మొదలైన పనులు పూర్తి చేసి రోడ్లను, పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సిఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని వెల్లడించారు. గురువారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రయాణించే విశాఖ ఎయిర్‌పోర్ట్, కాకాని నగర్, ఎన్ఎడి, తాటిచెట్లపాలెం, న్యూ కాలనీ, తెలుగు తల్లి ఫ్లైఓవర్, రాంనగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం, నొవాటెల్, విఎంఆర్‌డిఎ కార్యాలయం తదితర ప్రాంతాలలో జివిఎంసి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరానికి రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం రాత్రి విచ్చేస్తున్న సందర్భంగా నగరంలో పారిశుధ్యం, విద్యుత్తు, గ్రీనరీ మొదలైన ఏర్పాట్లను జివిఎంసి పూర్తి చేసిందన్నారు. అలాగే ఎయిర్ పోర్టు వద్ద సెరిమోనియల్ లాంచ్‌ను, అక్కడ తాగునీరు, పారిశుధ్యం, ఎలక్ట్రిసిటీ మొదలైన మౌలిక సదుపాయాలన్నింటినీ పరిశీలించి, జోనల్ కమిషనర్ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో విద్యుత్ వెలుగులు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. నేషనల్ హైవేలో కాకానినగర్ నుండి రోడ్డు మార్గంలో ఉన్న చెట్ల కొమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఎక్కువ విద్యుత్ కాంతి ఉండేలా చెట్ల కొమ్మలను తొలగించాలని డిడిహెచ్.దామోదరరావును ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కనున్న వ్యర్థాలను తొలగించడంతోపాటు కాలువలను శుభ్రపరచాలని జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌ను ఆదేశించారు. నగరంలో ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో పశుసంచారణ లేకుండా చూడాలని సిటీ పశు వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్‌కు సూచించారు. ఈ పర్యటనలో జివిఎంసి పర్యవేక్షక ఇంజినీర్లు సంపత్ కుమార్, పివివి.సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్లు బి.రాము, హేమావతి, సహాయ వైద్యాధికారులు సునీల్ కుమార్, డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సెవెన్ హిల్స్' యాజమాన్యంపై చర్యలకు వినతి



వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా హాస్పటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కోరారు. గురువారం హాస్పటల్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుకు వినతిపత్రం సమర్పించారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం ఎక్కువ లాభాలు గడించాలని లక్ష్యంతో కార్మిక చట్టాలు, ఎన్ఎబిహెచ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నందున తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. యాజమాన్యం కార్మికుల బతుకులతో ఆడుకొవడమే కాకుండా, హాస్పిటల్ కు వచ్చిన రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో కూడా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.275 పడకలు వున్న హాస్పిటల్లో 225 మంది ఆయాలు, వార్డ్ బాయ్స్, స్విపర్స్ ఎన్ఎబిహెచ్ సంస్థ నిబంధన ప్రకారం వుండాలన్నారు. కాని ప్రస్తుతం 104 మంది కార్మికుల మాత్రమే వున్నారని,వారిలో 38 మంది కార్మికులను యాజమాన్యం ఈ నెల 7 నుండి తొలగించేందుకు నోటీసలు ఇచ్చిందన్నారు. మరో పక్క 18 మంది కార్మికులను కొత్తగా నియమించిందని తెలిపారు.రాష్ట్రప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం చేస్తున్న కృషికి ఎంజిఎం యాజమాన్యం తీవ్ర ఆటంకం కల్గిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జగదాంబజోన్ సిఐటియు కార్యదర్శి ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, ఫిలామినా, నూకరాజు. ఈశ్వరరావు పాల్గొన్నారు.

రింగు వలలతో చేపల వేట నిషేధం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ ప్రకారం, ఆంధ్ర ప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ చట్టం -1994, మెరైన్ షిప్పింగ్ చట్టం 1958ననుసరించి విశాఖపట్నం జిల్లా తీర జలాలలో, రింగు వలతో వేట చేయుటకు లైసెన్స్ కలిగి ఉండాలని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగిన రింగు వలలు తీరం నుండి 8 కిలోమీటర్ల పరిధి దాటి ట్రాన్స్ పాండర్ పరికరం బోటుకు అమర్చి చేపల వేట చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో రింగ్ నెట్స్ తో చేపల వేట చేయుటకు ఏ ఒక్కరికి లైసెన్స్‌లు లేవన్నారు.రింగు వలలతో వేట పూర్తిగా నిషేధించడమైందన్నారు. నిబంధనలను అతిక్రమించి రింగు వలలతో వేట చేసినట్లైన చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

జివిఎంసి కౌన్సిల్ అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 11న జరగబోయే జివిఎంసి సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చించబోయే అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి సర్వసభ్య సమావేశం అజెండాలో పొందుపరిచిన అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సభ్యులు లేవనెత్తిన అంశంపై పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. శాఖల వారీగా సంబంధిత అధికారి అజెండాలోని అంశాలకు వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటంతో పాటు గత కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తిన ప్రశ్నలకు ఇవ్వవలసిన సమాధానంపై కూడా వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ విషయమై అజెండాలోని పొందుపరిచిన ప్రతి అంశంపై సంబంధిత అధికారులతో కమిషనర్ కూలంకుషంగా చర్చించి పూర్తి సమాచారంతో జరుగబోయే జివిఎంసి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమనారాయణ, ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, జోనల్ కమిషనర్లు 1, 3, 4, 5, 8 ప్రేమ ప్రసన్న వాణి, కె.శివప్రసాద్, ఎమ్.మల్లయ్యనాయుడు, బి.రాము, హేమావతి, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్.రవి, శాంసన్ రాజు, రామ్ మోహనరావు, గోవిందరావు, పివివి.సత్యనారాయణ రాజు, కార్యదర్శి బివి.రమణ, యుసిడి పీడీ పిఎమ్.సత్యవేణి, సిటీ ప్లానర్లు ధనుంజయ రెడ్డి, మీనా కుమారి, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతి రాజ్ పాల్గొన్నారు.

నివాసాలకు పట్టాలివ్వాలని ముఖ్యమంత్రికి లేఖలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమకు పట్టాలు మంజూరు చేయాలని, శ్లాబులకు అనుమతి ఇవ్వాలని 13వ వార్డు కేంద్రకారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురం ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వ్యక్తిగతంగా లేఖలు రాశారు. ఈ మేరకు గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యాన ఉత్తరాలను శ్రీకృష్ణాపురంలోని పోస్టాఫీసు ద్వారా రిజిస్టర్ పోస్టులో లేఖలు పంపించారు. గతంలో ఇక్కడ బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో నివాసాలు కోల్పోయిన సుమారు 230 మందికి ప్రత్యామ్నాయంగా గోశాల ఎదురుగా ఉన్న ఎస్ఎస్ఎన్.నగర్‌లో జివిఎంసి వారసత్వ హక్కులతో నివాసాలు కల్పించారని, మిగతా గ్రామాన్ని ఇక్కడే ఉంచారని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 600 మంది కుటుంబ సభ్యులతో ఇక్కడే నివాసముంటున్నారని, ఈ ప్రాంతం వాటర్ క్యాచ్‌మెంట్‌లో ఉందని చెప్పి పట్టాలు, శ్లాబులకు అనుమతి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కానీ ఆదే సర్వే నెంబరులో ఉన్న కొన్ని ప్రాంతాలకు అన్ని అనుమతులు మంజూరు చేశారని వివరించారు. భారీ వర్షాలు, తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమ నివాసాలు దెబ్బతిని ఆస్తినష్టం జరుగుతుందని, ఈ విషయాలను తమరు దృష్టిలో పెట్టుకొని తమకు న్యాయం చేయాలని లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు వంకర బాబూరావు, గౌరవాధ్యక్షులు కాకర గోవిందు, కార్యదర్శి సింహాచలం, అర్గనైజింగ్ సెక్రటరీ మరువాడ చిన్నారావు, ఎమ్‌డి నూర్జహాన్ భేగం, ఆర్‌జి నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పోస్టాఫీసు ద్వారా లేఖలు పంపిస్తున్న రామకృష్ణాపురం ప్రజలు

నేరాలు ఘోరాలు

చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన అల్లు గంగరాజు (29) మేకల మేత కోసం వేప చెట్టు కొమ్మలు నరుకుతుండగా, ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి కింద పడి మృతి చెందినట్లు మృతుని భార్య అల్లు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. గురువారం అల్లు గంగరాజు, తన సోదరుడు నాగేశ్వరరావుతో కలిసి మేకల మేత కోసం గొడిచెర్ల శివారు ప్రాంతానికి వెళ్లారు. గంగరాజు వేప చెట్టు ఎక్కి కొమ్మలు కోస్తుండగా, ప్రమాదవశాత్తు తన చేతికి కత్తి తగలడంతో పెద్ద గాయం అయ్యింది. దీంతో గంగరాజు కిందన పడిపోయాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, సంఘటన ప్రాంతానికి చేరుకుని గంగరాజును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని భార్య దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ సన్నిబాబు సంఘటన ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు.


హెల్త్ డైరెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న వీరబ్రహ్మం, గోపీనాథ్

హెల్త్ డైరెక్టర్ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతిని నేషనల్ హెల్త్ మిషన్ విశాఖపట్నం జిల్లా ఉద్యోగ సంఘం సెక్రటరీ వి.వీరబ్రహ్మం, ట్రెజరర్ ఎంవివి.గోపీనాథ్ కలిసి నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్ ద్వారా జీతాలు కటింగ్ విషయంపై మాట్లాడారు. కొన్ని సందర్భాల్లో సిగ్నల్ ప్రాబ్లం వల్ల ఎఫ్ఆర్ఎస్ అవడం లేదని, దాని వల్ల కూడా జీతాలు కటింగ్ అవుతున్నాయని వివరించారు.

ఖుర్దా డివిజన్‌లో పలు రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఖుర్దా రోడ్ డివిజన్‌లో 3వ లైన్‌ను ప్రారంభించేందుకు సంబంధించి భద్రక్ స్టేషన్‌లో ప్రీ నాన్-ఇంటర్‌లాకింగ్, నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 8వ తేదీన 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్, 10వ తేదీన 22853 షాలిమార్ - విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 22825 షాలిమార్-ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 11వ తేదీన 22854 విశాఖపట్నం-షాలిమార్, 12868 పుదుచ్చేరి-హౌరా, 22826 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్, 12వ తేదీన 22874 విశాఖపట్నం-దిఘా, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 13వ తేదీన 22873 దిఘా-విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 14వ తేదీన 20889 హౌరా-తిరుపతి హంసఫర్, 12666 కన్యాకుమారి- హౌరా సూపర్ ఫాస్ట్, 15వ తేదీన 20890 తిరుపతి-హౌరా, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 12867 హౌరా-పుదుచ్చేరి, 22855 సంత్రాగచ్చి-తిరుపతి, 16వ తేదీన 12665 హౌరా- కన్యాకుమారి, 22856 తిరుపతి-సంత్రాగచ్చి, 17వ తేదీన 22853 షాలిమార్ - విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 22825 షాలిమార్- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 18వ తేదీన 12868 పుదుచ్చేరి-హౌరా, 22826 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్, 19వ తేదీన 22854 విశాఖపట్నం-షాలిమార్, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ లను రద్దు చేశారు.

టెక్ కాన్‌క్లేవ్‌లో గీతం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : టెక్నోవేట్ ఫర్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన టెక్ కాన్‌క్లేవ్-2024లో గీతం విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. గీతం సిఎస్ఇ విభాగం విద్యార్థి పి.జగదీష్, సిఎస్‌బిఎస్ విద్యార్థి ఎస్.గిరీష్ కుమార్ బృందంగా ఏర్పడి ఈ-ఉపద్ పేరిట సరికొత్త ప్రాజెక్టును రూపొందించారు. చిన్న ఐటి ప్రాజెక్టులు నిర్వహించే వారికి సులభ తరంగా చెల్లింపు విధానాలు, వీడియోలు ఇతర గుర్తింపు పత్రాలను తేలికగా కృత్రిమ మేధతో ఉపయోగించే పద్ధతులను తమ ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి తెచ్చారు.

ఉత్సాహంగా 'కళా ఉత్సవ్' పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో రెండురోజులు జరుగనున్న 'కళా ఉత్సవ్' ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలు గురువారం ఉత్సాహ పూరితంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి ముందుగా పోటీలను ప్రారంభించారు. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటక రంగం, దృశ్య, సంప్రదాయ కళలపై పోటీలు నిర్వహించారు. 6 ప్రభుత్వ పాఠశాలల నుంచి 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు 75 మంది తొలి రోజు పోటీల్లో పాల్గొని ప్రతిభను చూపారు. భీమిలి, ఆనందపురం, కెజిబివిలు, నడుపూరు, కాశీపురం జెడ్‌పి హైస్కూళ్ల, భీమిలి జివిఎంసి హైస్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలకు సమన్వయ కర్తగా డైట్ వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ వ్యవహరించారు. పలువురు అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అధ్యాపకులు జిజిఎస్.నాగేశ్వరరావు, ఎన్.త్రినాథరావు, సి.ఎ.సోమయాజులు, జె.మాధవి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యం దాగి ఉన్న వికలాంగ క్రికెట్ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) నూతన అధ్యయనానికి నాంది పలుకుతోంది. కొత్త వికలాంగ క్రికెట్ క్రీడాకారులు తమ పేర్లను ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కౌన్సిల్ పర్యవేక్షణలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎంపిక చేసి అనంతరం పోటీలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు గురువారం ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని వికలాంగ క్రికెట్ క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, కౌన్సిల్ సభ్యుడు కొండా సత్యవరప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చదరంగం పోటీలు



చదరంగం పోటీల వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిథ్యంలో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఎఐయు) ఆధ్వర్యాన ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు దక్షిణ మండల (సౌత్‌జోన్) పరిధిలోని 5 రాష్ట్రాలకు చెందిన అంతర్ విశ్వవిద్యాలయాల మధ్య మహిళల చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం విశ్వవిద్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలను వెల్లడిరచారు. ఈ పోటీలకు దక్షిణ భారత దేశంలోని 65 విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 300 మంది చదరంగ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 72 మంది, తెలంగాణా నుంచి 48, తమిళనాడు నుంచి 90, కర్ణాటక నుంచి 48, కేరళ నుంచి 36 మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాలలోని ఎల్లాప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో ఈ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోటీలకు ఆర్బిట్రేటర్‌గా వ్యవహరిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ చదరంగం కోచ్ ఎమ్‌విఎస్.ప్రసాద్ మాట్లాడుతూ, ఈ పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విజేతలు త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి మహిళ చదరంగం పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు. ఈ విలేకర్ల సమావేశంలో గీతం క్రీడా విభాగం మేనేజర్ రితేష్ సిన్హ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎంపిడిఓ సమీక్ష

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండల కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపిడిఓ డాక్టర్ వి.జానకి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ జానకి మాట్లాడుతూ, ఇంటి పన్ను సేకరణ, కంపోస్టు ఎరువులు, షెడ్ల నిర్వహణ, సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, మండలంలోని సూక్ష్మ చిన్న, మధ్య తరహా సంస్థలపై సర్వే, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిధులకు సంబంధించి ఖాతాలు తెరవడం గురించి, ఆధార్ నిర్వహణకు ప్రత్యేక క్యాంపులు నిర్వహణపై సమావేశంలో అజెండాగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.సత్యనారాయణ, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

హౌసింగ్ పనులను వేగవంతం చేయాలి

మండలంలోని పలు పంచాయతీల్లో ఇంటి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి టి.ప్రవీణ్ కోరారు. హౌసింగ్ సమీక్షపై ఎంపిడిఓ మాట్లాడుతూ, గతంలో మంజూరైన ఇళ్లను నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణాల ఆటంకాలకు కారణాలు తెలుసుకొని లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఈ శ్యాంసుందర్, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవంతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బిఎస్ఎన్ఎల్ సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో గురువారం "ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ నెట్ వర్క్స్ అంశంపై పలువురు ఉపన్యసించారు. ప్రోగ్రాం ప్రాముఖ్యతను అతిథులు వివరించారు. బిఎస్ఎన్ఎల్ ఎజిఎం ఎం.శ్రీనివాసరావు ప్రోగ్రామ్‌ను ప్రారంభించి మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక రంగంలో టెలి కమ్యూనికేషన్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ వి.శివభాస్కరరావు, కన్వీనర్ పి.శంకరరావు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న బిఎస్ఎన్ఎల్ ఎజిఎం శ్రీనివాసరావు



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అతిథులు

ఆదర్శ్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జివిఎంసి సహకారంతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అప్పలనాయుడు మాట్లాడుతూ, మైక్రో ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సమాజానికి ఎంత ప్రమాదకరమో వివరించారు. ప్లాస్టిక్ నిషేధంలో అందరి సహకారం అవసరమని తెలిపారు. జివిఎంసి ఎఎంహెచ్‌ఒ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వల్ల భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఈ రోజు నుంచి ఆదర్శ్ కాలేజీలో బ్యాన్ చేస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్ వెంకటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ 3 యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్ జె.మంజుల, డిఎస్.ప్రదీప్, ఎస్.సంధ్యారాణి, కళాశాల సిబ్బంది, జివిఎంసి సిబ్బంది వివిఎస్.నాయుడు, డి.నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్మకారులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ జన్మదినం సందర్భంగా కాకానినగర్ సెంటర్‌లో రోడ్డుపై చర్మకార వృత్తి చేసుకుంటూ జీవనం గడుపుతున్న కడియాల ఆనందరావు, సోవాటి శంకర్‌కు పది కిలోల బియ్యం, ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను యాక్ట్ (అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్) ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాక్ట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆళ్ళమూడి ప్రభాకరరావు, విశాఖపట్నం కో-ఆర్డినేటర్ పి.భీమారావు, ఎయిర్‌పోర్టు ఏరియా కో-ఆర్డినేటర్ కటారి కార్తీక్ పాల్గొన్నారు.

1 నుంచి ప్లాస్టిక్ వస్తువుల నిషేధం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : 2025 జనవరి 1 నుంచి విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. విశాఖ నగర ప్రజలు ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకోవాలని కోరారు. శనివారం ఉదయం 6:30 గంటలకు ఆర్‌కె.బీచ్ సమీపంలో ప్లాస్టిక్ రహిత విశాఖకు సహకరించాలని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జివిఎంసి నిర్వహిస్తోందని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి నేను సైతం అంటూ విశాఖ స్వచ్ఛ అంబాసిడర్, ఫిలిం సెలబ్రిటీ ఆర్‌పి.పట్నాయక్ హాజరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


కోలుకున్న రోగితో డాక్టర్

కిడ్నీలోని దుప్పికొమ్ము రాయి తొలగింపు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖపట్నానికి చెందిన 46 ఏళ్ల వ్యక్తికి 5 సెంటీమీటర్ల పొడవు, 5 సెంటీమీటర్ల వెడల్పు ఉన్న పెద్ద దుప్పికొమ్ము రాయిని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో తొలగించినట్లు వైద్యులు తెలిపారు. మూడు నెలలుగా మూత్రంలో రక్తం వస్తుండడంతో కిమ్స్ ఐకాన్‌లోని యూరాలజిస్టు డాక్టర్ కె.అభిరామ్‌ను కలిశారు. పరీక్షలు చేయగా ఎడమవైపు కిడ్నీలో పెద్ద దుప్పికొమ్ము రాయి ఉన్నట్లు తేలింది. దానివల్ల మూత్రపిండాల పనితీరు చాలా దెబ్బతింది. ఆస్పత్రికి వచ్చే సమయానికి అతడి మూత్రపిండం కేవలం 30 శాతం మాత్రమే పనిచేస్తోంది. దాంతో లాపరోస్కోపిక్ పద్ధతిలో రాయి తొలగించారు. రోగి బాగా కోలుకోవడంతో శస్త్రచికిత్స చేసిన రెండోరోజే ఇంటికి పంపేశారు.

సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా...

నేటి నుంచి సమావేశాలు, గేటు మీటింగులు

డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఎన్ఎడి కార్మికులు, నాయకుల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా రక్షణ రంగంలో ఉన్న ఎఐడిఇఎఫ్ భాగస్వామ్య యూనియన్లు, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సంయుక్తంగా గ్రూపు సమావేశాలు నిర్వహించాలని, గేట్లు వద్ద నినాదాలు చేపట్టాలని నిర్ణయించినట్లు డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు తెలిపారు. ఎన్ఎడి ప్రధాన గేటు వద్ద గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 నవంబర్ 1వ తేదీన నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిజిఎం దివాకర్‌జైన్ కార్మికులకు స్టోరేజ్ ఓటీ చట్ట విరుద్ధమని, ఇవ్వబోమని చెబుతూ సమస్యలు సృష్టించారని వివరించారు. ఎన్ఎడిలో గత 20 సంవత్సరాలుగా వస్తున్న అనవాయితీని కొనసాగించాలని లేబర్ ఆఫీసర్, యూనియన్ నాయకులు విజ్ఞప్తిచేసినా పట్టించుకోవటం లేదని తెలిపారు. గత సిజిఎంలు ఫ్యాక్టరీ యాక్ట్‌కు భిన్నంగా పనిచేశారని, యాజమాన్యంతో చర్చించిన అంశాలు కార్మికులకు నాయకులు సరిగ్గా చెప్పటంలేదని, కాబట్టి కార్మికులు తన కార్యాలయానికి రావల్సిందిగా కోరారని వివరించారు. దీంతో కార్మికులు సిజిఎం కార్యాలయానికి వెళ్లారని తెలిపారు. సిజిఎం చెప్పిన విషయాలు విన్న తర్వాత తమకు రావల్సిన ఓటీ ఎమౌంట్ ఇవ్వటానికి మీకు ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. మహిళ కార్మికులు తమ సమస్యలు చెపుతున్నప్పుడు సిజిఎం అసభ్యకర పదజాలంతో మాట్లాడారని, దీంతో కోపం వచ్చిన కార్మికులు సిజిఎంతో వాగ్వాదం చేస్తుండగా తన సెల్‌ఫోన్‌లో విషయాన్ని చిత్రీకరించి 36 మందిని సస్పెండ్‌చేశారని వివరించారు. సిజిఎం కార్యాలయానికి వెళ్లని వారిని, సెలవులో ఉన్నవారిని కూడా సస్పెండ్ చేశారని తెలిపారు. దీనిపై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా వారిపై సస్పెన్షన్ను ఎత్తివేసి, కొత్తగా మరో ఏడుగురిని సస్పెండ్‌చేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పెతకంశెట్టి గణబాబు, పల్లా శ్రీనువాసరావు కార్మికులకు సంఘీభావం తెలిపారని, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు కార్మికులను ప్రత్యక్షంగా కలసి మద్దతు తెలిపారని చెప్పారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి వెంకటరావు

8న బైక్ ర్యాలీ

నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీన ఉదయం 9గంటలకు ఎన్ఎడి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని వెంకటరావు తెలిపారు. విశాఖ రక్షణ రంగంలోని అన్ని యూనియన్ల కార్మికులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎడి సిఐ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి.థామస్, అధ్యక్షుడు నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, వర్క్స్ కమిటీ సెక్రటరీ డివి.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు


గంధం శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు నడుపూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లగా రాజకీయాలలో ఉంటూ ప్రజా సేవ చేస్తూ 76వ వార్డులో వరుసగా నాలుగు సార్లు కార్పొరేటర్‌గా విజయం సాధించి ఓటమి ఎరుగని నాయకునిగా గంధం శ్రీనివాసరావు మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ, వార్డు ప్రజలందరి సహాయ సహకారాలతో వరుసగా నాలుగు సార్లు విజయం సాధించి ప్రజా సేవ చేసుకునే భాగ్యం కలిగిందని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జన్మదిన వేడుకలలో భాగంగా చిన్న నడుపూరులోని అనాథాశ్రమంలో పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, ముత్యాలనాయుడు, బొండా జగన్, రైతు శ్రీనివాసరావు, పులి రమణారెడ్డి, దల్లి గోవింద్, కేబుల్ మూర్తి, ఇల్లపు రాము, వార్డు అధ్యక్షుడు బొసెట్టి అప్పారావు, పీత రమణ, జిత్తిక రాజు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో నూతన ఆవిష్కరణపై అవగాహన

ప్రజాశక్తి-విశాఖపట్నం : పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఏయు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఏయు కెమిస్ట్రీ విభాగంలో నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్ఎంఇసిఇ-2024) జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ శశిభూషణరావు మాట్లాడుతూ, ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సును నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ, వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ఆచార్యులు డాక్టర్ జి.రఘు రామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నానో మెడిసిన్స్ ప్రభావంతంగా పనిచేస్తున్న విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని అనుసంధానం చేస్తూ మూడు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల సదస్సులో భాగంగా ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు. సదస్సులో దేశం నలుమూలల నుంచి ఆచార్యులు పరిశోధకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏయు వీసీ శశిభూషణరావు


సమావేశంలో మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

8న జర్నలిస్టుల వనసమారాధన

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరములోని శివాజీపార్కులో ఈ నెల 8వ తేదీన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పౌరగ్రంథాలయంలో ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియమ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఫెడరేషన్ ఆధ్వర్యాన జర్నలిస్టుల వన సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి అల్పాహారంతో ప్రారంభమై మౌనిక కల్చరల్ అకాడమీ సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీడిప్ ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం విందు భోజనం అనంతరం ఇతర కార్యక్రమాలతో ముగుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బ్రాడ్ కాస్ట్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, మధన్, స్మాల్ అండ్ మిడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, కె.శ్రీనివాసరావు, అర్బన్ యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దవళేశ్వరం రవికుమార్, ఉపాధ్యక్షులు బందారు శివప్రసాద్, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వై. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన వంశీకృష్ణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ నగరానికి విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పూర్వ విద్యార్థులు నిర్మించిన వేదికపై ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -మునగపాక: స్థానిక జెడ్పి హైస్కూల్‌లో 1995- 96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సొంత నిధులతో నిర్మించిన సరస్వతి వేదిక గురువారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 25ఏళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలని భావించి, అనుకున్నదే తడవుగా రూ.2.20లక్షలను సమకూర్చి వేదిక నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు.. 7న జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఈ వేదికపైనే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, పూర్వ విద్యార్థులు మాడిశెట్టి ఆనంద్, మాడెం జోగారావు పాల్గొన్నారు.

బదిలీ డిఆర్‌ఒకు ఘన సత్కారం



డిఆర్‌ఒదయానిధిని సత్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : విఎంఆర్‌డిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న డిఆర్‌ఒ బి.దయానిధిని గురువారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. టిడిపి పార్లమెంటు కార్యాలయం జిల్లాకార్యదర్శి బొలిశెట్టిశ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్‌బాబు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఓటర్ల నమోదు నుంచి ఎన్నికలను విజయవంతంగా నిర్వహణలో డిఆర్‌ఒగా దయానిధి అవిశ్రాంతంగా పనిచేశారని కొనియాడారు. అనంతరం బి దయానిధి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో తనకు అన్ని విధాలా సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మునగపాక: విద్యుత్ లైన్ల, నిర్వహణ, మరమ్మతులు, వైర్ల కింద చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో ఈనెల 6న దయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఇఇ రామకృష్ణ తెలిపారు. మునగపాక, అరబ్బుపాలెం, వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, రాజుపేట, గొల్లల పాలెం, కుంచవానిపాలెం, అప్పికొండ, కొత్త నాగవరం, పాతనాగవరం గ్రామాలకు కరెంట్ ఉండదు.

విద్యార్థులకు 'బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష'

ప్రజాశక్తి - సీలేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో విద్యార్థుల బరువు, ఎత్తు కొలతలను .ఆశా కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వలీ మాట్లాడుతూ ప్రతి చిన్నారి ఆరోగ్యరక్షలో భాగంగా వారికి తనిఖీలు చేశామని, వ్యాధులు, ఇతరత్రా అనారోగ్య సమస్యలుంటే సత్వర చికిత్స అందించడమే దీని లక్ష్యమన్నారు. పుట్టినప్పటి నుంచి 18ఏళ్లలోపు పిల్లలకు 44 రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. ప్రతి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో సంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు బాలామణి,పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- అనకాపల్లి : దీపావళి రోజున ప్రారంభించిన దీపం -2 పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళల నుంచి విశేష స్పందన వచ్చిందని, అర్హులందరికీ ఉచిత గ్యాస్‌ను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామం రామాలయం వీధిలో కందుల ఈశ్వరరావు ఇంటికి వెళ్లి దీపం-2 పథకం గ్యాస్‌బండను అందజేసి, అక్కడే టీ చేసి, కుటుంబ సభ్యులతో కలిసి తాగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్యాస్ వినియోగంతో వంట కష్టాలు తొలగిపోయాయని, ఇపుడు . నేడు ఫోన్ చేస్తే దీపం పథకం కింద ఇంటికే గ్యాస్ వస్తుందన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్ని హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లలో 81 లక్షలమంది దీపం -2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారన్నారు. సబ్సిడీ సొమ్మును 48 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాలో పడేలా ఏర్పాట్లు చేసామన్నారు. గ్యాస్ కనెక్షన్, ఆధార్‌కార్డు, రైస్‌కార్డు కలిగి ఉండడమే అర్హతలుగా అందరికీ ఉచిత గ్యాస్ పథకాన్ని వర్తింపజేస్తున్నామన్నారు.

దీపం పథకం రాకపోతే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చెయ్యాలని వెంటనే అధికారులు స్పందిస్తారని, జిల్లా స్థాయిలో అయితే కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా పౌరసరఫరాలు అధికారి కెవిఎల్ఎన్ మూర్తి, తహసీల్దార్ విజయకుమార్ పాల్గొన్నారు.

బిటి రోడ్డు విస్తరణకు శంకుస్థాపన

అనకాపల్లి పట్టణ పరిధిలోని ఎఎంఎఎల్ కాలేజీ వంతెన నుంచి శారదా నది వంతెన వరకు కిలోమీటర్ పరిధిలో బిటి రోడ్డు విస్తరణ, పటిష్ట పరిచే పనులకు రూ.2 కోట్ల 70 లక్షలతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, ఆర్‌డిఒ షేక్ ఆయిషా, ఆర్‌అండ్‌బి ఇఇ రమేష్, డిఇఇ కాంతారావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల జయప్రదానికి సహకరించండి

● రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డిఆర్‌ఒ దయానిధి



మాట్లాడుతున్న డిఆర్‌ఒ దయానిధి

ప్రజాశక్తి -అనకాపల్లి : రెవెన్యూ సదస్సుల విజయవంతానికి రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సహకారాన్ని అందించాలని డిఆర్‌ఒ బి. దయానిధి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులు వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదు ఎక్కువగా వస్తున్నాయని, గ్రామస్థాయి రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను పరిష్కారం చేసుకుంటే ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈనెల 6 నుంచి వచ్చేనెల 8 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించి, అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

గ్రామంలో రీసర్వే చేసి ఉంటే, కొత్తగా తయారు చేసిన ఆర్‌ఓఆర్‌ను గ్రామంలో చదివి, అభ్యంతరాలు ఏవైనా ఉంటే పరిశీలిస్తారని, వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు డి పరమేశ్వరరావు, కొండబాబు, పి నాగేశ్వరరావు, బి అప్పారావు, మీసాల సుబ్బన్న, గంటా శ్రీరామ్, పి వెంకన్న, బి రాజేంద్రప్రసాద్, కె కనకరాజు, బి అప్పారావు, కె హరినాథ్ బాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గాడి శ్రీను, గాడి బాలు పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం

ప్రజాశక్తి-అనకాపల్లి : పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో రైతులు చేరడం ద్వారా నష్టపరిహారాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి జి ప్రభాకరరావు సూచించారు. గురువారం స్థానిక జిల్లా ఉద్యానవనశాఖ కార్యాలయంలో దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సహకారంతో వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం వలన కలిగే ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకుంటుందన్నారు. ఈ పథకాన్ని రబీ 2024- 25లో మామిడి పంటకు కూడా అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో 15 జిల్లాల్లో అమలవుతున్న పథకంలో చేరేందుకు ఈనెల 15 ఆఖరు తేదీ అన్నారు. ఇందులో చేరే మామిడి రైతులకు ఎకరాకు కనిష్టంగా రూ.33వేలు నుంచి గరిష్టంగా రూ.45 వేల బీమా పరిహారం పొందవచ్చన్నారు. ప్రీమియంగా రూ. 1,650 నుంచి రూ.2,500 చెల్లించాలన్నారు.బీమా పొందేందుకు దగ్గరలో ఉన్న బ్యాంకులు గానీ, కామన్ సర్వీస్ సెంటర్ లేదా బీమా కంపెనీ నియమించబడిన వ్యక్తులు లేదా రైతులు నేరుగా పిఎంఎఫ్‌బివై పోర్టల్ లో మొబైల్ ద్వారా పొందవచ్చున్నారు. బ్యాంకు అకౌంట్స్, ఆధార్ కార్డు, భూమి పాసు బుక్ జిరాక్స్, పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఐసి జిల్లా కోఆర్డినేటర్ వెంకట గణేష్, ప్రతినిధి మోహన్, మండల ఉద్యానవన శాఖ అధికారులు ఎం సాయిప్రియ, ఆర్ కిరణ్మయి, ఎ.లావణ్య, విబిపి లీలావతి, ఎస్ శిరీష పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా హార్టీకల్చర్ అధికారి

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

13, 14 తేదీల్లో యలమంచిలిలో నిర్వహణ



మహాసభల పోస్టరు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి :ఈ నెల 13,14 తేదీల్లో యలమంచిలిలో ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా మహాసభలకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఉపాధ్యక్షుడు ఎం బాలాజీ తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, విద్య, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తోందన్నారు. పదేళ్ల తర్వాత యలమంచిలిలో మళ్లీ జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, దీనికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరిచాలని కోరారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యల పరిష్కారంలో శక్తివంచన లేకుండా శ్రమిస్తామన్నారు. కార్యక్రమంలో యలమంచిలి డివిజన్ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కె.మణికంఠ, రవి, రాము, అజయ్, రాజు, సునీల్, కృపానంద, రాజేశ్వరి, లహరి, లలిత, అలేఖ్య , భవాని, జ్యోతి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ విజేత 'ప్రతిభ'



బహుమతులతో బాస్కెట్‌బాల్ విజేతలు

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రతిభ విద్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ఇంటర్‌షిప్ బాస్కెట్ బాల్ టోర్నీ విజేతగా నిర్వాహక ప్రతిభ విద్యాలయం నిలిచిందని కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. ద్వితీయస్థానంలో విశాఖ అలియాసిస్ హైస్కూల్ నిలిచిందన్నారు. మూడు, నాలుగు స్థానాల్లో కాపులుప్పాడ శ్రీప్రకాష్ స్కూల్ విద్యార్థులు నిలిచారు టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో తహశీల్దార్ బి. చిన్నకృష్ణ, సిఐ పిన్నింటి రమణ, విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, జి. భూషణరావు పాల్గొని విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. తహసీల్దార్ చిన్నికృష్ణ, సిఐ రమణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ మాట్లాడుతూ జిల్లాలో వివిధ పాఠశాలల విద్యార్థులు టోర్నమెంటులో ఉత్సాహంగా పాల్గొనడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రతిభ విద్యాలయం డైరెక్టర్ ఆదిరెడ్డి శరత్‌తేజ, ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఆర్‌ఒగా సత్యనారాయణరావు

ప్రజాశక్తి-అనకాపల్లి :

అనకాపల్లి జిల్లా రెవిన్యూ అధికారిగా వైఎస్‌వికెజిఎస్-ఎల్ సత్యనారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యనారాయణ రావు అన్నమయ్య జిల్లా రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లాకు డిఆర్‌ఒగా బదిలీపై వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



డిఆర్‌ఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణరావు

సాదాసీదాగా మండల సమావేశం



మండల సభలో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి - పరవాడ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పైలా వెంకటపద్మ లక్ష్మీశ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయం , విద్య, ఆరోగ్య , గ్రామీణ నీటి పారుదల, గృహ నిర్మాణ, తదితర శాఖలపై శాఖలవారీ సమీక్ష జరిపారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.ప్రజలు ఇబ్బంది పడకుండా రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తిచేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి పిఎస్ రాజు, ఎంపిడిఒ శ్యామ్ సుందర్, తహశీల్దార్ అంబేద్కర్, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూన అప్పలరాజు, సర్పంచ్లు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగించరూ..!

ప్రజాశక్తి- సబ్బవరం :మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామపంచాయతీ శివారు పైడివాడ గ్రామంలో వీధిలైట్లు పరిస్థితి చాలా దారుణంగా ఉందని మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ ఆవేదన వ్యక్తంచేశారు. తన ఇంటి దగ్గర గత మూడు నెలలుగా వీధిదీపం వెలగడం లేదని, దీనిపై గ్రామ సర్పంచ్కు, గ్రామ కార్యదర్శికి, విద్యుత్ సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. మాజీ సర్పంచ్ ఇంటి దగ్గరే ఇలాంటి పరిస్థితి నెలకొంటే, గ్రామంలో పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాకముందు తమ సొంతనిధులతోకొన్ని వీధి లైట్లు వేయించామని, ఇపుడూ అలాగంటే ఎలాగని ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి వీధిలైట్లు వేయాలని కోరారు.దీనిపై స్థానిక సర్పంచ్ వడ్డాది అప్పలరాజును వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని లైట్లు పోయాయని, ఒకటి, రెండు రోజుల్లో వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసారు.

ఎమ్మెల్సీ చిరంజీవికి వినతి



ఎమ్మెల్సీ చిరంజీవిని అభినందిస్తున్న నోబెల్ యూనియన్ టీచర్లు

ప్రజాశక్తి- అనకాపల్లి :ఉమ్మడి విశాఖ జిల్లా నుండి అల్లూరి ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులను రాబోయే బదిలీలలో స్పెషల్ కేటగిరీగా పరిగణిస్తూ మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు కోరారు. గురువారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టివి రమణ,ఎన్. శ్రీనుబాబు ఉన్నారు.

రమేష్‌కు సత్కారం

ప్రజాశక్తి- కశింకోట :మండలంలో బంగారయ్యపేట బసవేశ్వర ఆలయంలో ప్రతిష్టించిన గౌరీ పరమేశ్వరులను తాళ్ళపాలెం గ్రామ టిడిపి అధ్యక్షులు ఉల్లింగల రమేష్ గురువారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో నక్కిన వెంకట్రావు, బూడిద అప్పారావు, శివ పాల్గొన్నారు.

మట్టి సంరక్షణతోనే భవిష్యత్తుకు పునాది



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి రంగాచారి

ప్రజాశక్తి-అనకాపల్లి : మట్టి సంరక్షణ భవిష్యత్తుకు బంగారు పునాది అని ఎఒ పి.రంగాచారి అన్నారు. గురువారం ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్టూరు గ్రామంలో రైతులతో మాట్లాడుతూ, రైతులు, విద్యార్థులకు మట్టి విలువను వివరిస్తూ, మానవ మనుగడకు, ఆహార ఉత్పత్తులకు నేలల సంరక్షణపై వివరించారు. నేలలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పచ్చిరొట్ట పైర్లను వినియోగించాలని, తద్వారా పంటలకవసరమైన 15 రకాల పోషకాలను సమృద్ధిగా అందుతాయన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో కలుషిత పంట దిగుబడులతోపాటు నేలలు నిస్సారమై, భవిష్యత్‌లో పంటలు పండని దుస్థితికి చేరుతాయన్నారు. నేలల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో మార్టూరు సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాస్, రవిరాజ్, ప్రవీణ, గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

రావికమతం : స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశంలో ఎఒ డి.రూప మాట్లాడుతూ రైతులకు నేల సారవంతం, దాని పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భూసార పరిరక్షణకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ పద్ధతిలో సాగు చేయాలన్నారు. అనంతరం గత ఏడాది మట్టి నమూనా కార్డులను రైతులకు అందజేశారు.

ఘనంగా 'శివ శివాని' క్రీడా వార్షికోత్సవం



క్రీడా వార్షికోత్సవంలో విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఉక్కునగరం సెక్టర్ 10లోని శివ శివాని పబ్లిక్ స్కూల్లో ఐసిఎస్‌సి 32వ క్రీడా వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. శివశివాని పాఠశాల జనరల్ సెక్రటరీ సుధాకర్ కుమార్, ఎస్ సంపత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీలలో పిపిఐ నుండి పదవ తరగతి వరకు బాలబాలికలు 25 మీటర్లు, 50 మీటర్లు, 100 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందేల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫ్యాన్సీ డ్రిల్, ఫ్రాంక్ డ్రిల్, పిరమిడ్స్ ఆకట్టుకున్నాయి.ప్రతిభ చూపిన వారికి పాఠశాల కరస్పాండెంట్ ఉష, ఎస్ వసంత్ పతకాలను బహుకరించారు.జూనియర్ విభాగంలో బి వసంతలక్ష్మి, శ్రీసాయి, ఆర్ విష్ణువర్ధన్ సీనియర్ విభాగంలో కె.సాయిసింధుజ. టి దరఖాస్, ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ద్వితీయ స్థానంలో శివాజీ హౌస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కెవి రమణ, వైస్ ప్రిన్సిపల్ కె.జ్యోతి, ఎఒ డాక్టర్ సాక్షి సంపత్, హెచ్‌ఎం శైలజ చౌహాన్, శివ శివాని పబ్లిక్ స్కూల్ సిబిఎస్‌ఇ ప్రిన్సిపల్ కె శ్రీనివాసరావు, పిఇటిలు ఖాదర్, ప్రసాద్, అప్పారావు, లక్ష్మణరెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని సుంకరమెట్ట సత్యనారాయణమూర్తి దేవస్థానంలో కార్తీక మాసంలో భక్తులు సమర్పించిన కానుకలు, హుండీ రాబడిని గురువారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలతో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళి, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి మురళి పర్యవేక్షణలో హుండీ లెక్కింపులో రూ.1,43,455 నగదుతోపాటు 2 సింగపూర్ డాలర్స్, 2 దుబాయ్ ధీరమ్స్ కాయిన్, థాయిలాండ్ బట్స్ వచ్చాయి.. గతేడాది హుండీ ఆదాయం రూ.92,404తో పోల్చుకుంటే రూ.51,051 ఎక్కువగా వచ్చిందని చైర్మన్ మురళి తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పెంటకోట చంద్రరావు, సూరిశెట్టి బల్లమ్మ, శ్రీకాకుళం గణపతి, మారిశెట్టి భాస్కరరావు, తురకలపూడి హేమ, దొడ్డి భరత్, దేవాలయ ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది అనపర్తి శంకరరావు పాల్గొన్నారు.

షర్మిల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపిసిసి అధ్యక్షురాలు, సొంత చెల్లెలు షర్మిలారెడ్డి వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తానంటూ జగన్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచి, ప్రజలపై రూ.72 వేల కోట్లు భారం మోపిన జగన్‌రెడ్డి, అప్పుల్లో డిస్కంలకు రూ.11వేల కోట్ల బకాయిలను ఉంచేశారని, ఇపుడవి వినియోగదారులు తప్పక చెల్లించాల్సిన పరిస్థితిలో నిందను చంద్రబాబుపై మోపడం సరికాదన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్, వసతిదీవెన నిధులు రూ.3500 కోట్లు వైసిపి కాంట్రాక్టర్లకు బిల్లులుగా చెల్లించి, నేడు కూటమి ప్రభుత్వంపై అబద్దాల ఆరోపణలు చేయడం జగన్‌కే చెల్లిందని మండిపడ్డారు. దీంతో ఉన్నత విద్యావకాశాలకు దూరమౌతున్న బిటెక్ విద్యార్థులకు నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి కుప్పిలి జగన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ బోడి వెంకట్రావు, పార్లమెంట్ వాణిజ్య విభాగం సెక్రటరీ సాలాపు నాయుడు, అనకాపల్లి పార్లమెంట్ టి ఎస్ టి యు సి ఉపాధ్యక్షులు దొడ్డి జగదీష్ పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌కు ఘనస్వాగతం



మంత్రి నాదెండ్లను స్వాగతిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, నేతలు

ప్రజాశక్తి- సబ్బవరం: విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గురువారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, కూటమి నేతలు పుష్పగుచ్ఛాలతో స్వాగతించి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, గండి ముత్యాల నాయుడు, కంచిపాటి రాంబాబు, పిల్లా జగన్మోహన్ పాత్రుడు, బంటికోళ్ల పద్మ, గొర్లి కుమారస్వామి పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : మేజర్ పంచాయితీ కొత్తూరు మద్దాలవారి వీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల సందర్భంగాకమిటీ చైర్మన్ మద్దాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అమ్మవారి సారె ఊరేగించారు. మద్దాల వెంకట్రావు, మద్దాల శ్రీను, కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి నూకరాజు, బర్ల నాగరాజుపాల్గొన్నారు

రేపు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 7న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు డిఇఒ అప్పారావు నాయుడు తెలిపారు.1447 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహిస్తుండగా, ఎంపిక చేసిన 34 పాఠశాలల్లో జరిగే సమావేశాలకు జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి స్పీకర్, మంత్రులు, శాసనసభ్యులు హాజరవుతారన్నారు. పాఠశాల ప్రగతి, మౌలిక వసతులపై తల్లిదండ్రుల సమక్షంలో చర్చించడం, పాఠశాలల్లో విద్యార్థులకు తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించడం, బడి బయట ఉన్న పిల్లలను చేర్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫోన్ నెంబర్స్ సిఎంఒ 9441465433, ఎఎస్ఒ 8500714084, గౌరీ ఈశ్వరరావు 7780621162, వరలక్ష్మి 8096526649 నంబర్లను సంప్రదించాలన్నారు.

మునగపాక: ఈనెల 7న మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఇఒలు డి వేణుగోపాలరావు, బుద్ద శివనాయుడు కోరారు. పాఠశాలల యాజమాన్య కమిటీలు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించే సదస్సుకు ఇప్పటికే తల్లిదండ్రులకు పిల్లలచే ఆహ్వాన పత్రికలు పంపించామన్నారు. విద్యార్థుల ప్రగతిని చర్చించి, వారి ప్రగతికి కృషిపై, ప్రణాళికలు రూపొందించడానికి ఈ సమావేశం తోడ్పడుతుందన్నారు.

కె.కోటపాడు: రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఈనెల 7న శనివారం పండగ వాతావరణంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గంలో ఐదు పాఠశాలలను సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎంపిక చేశామన్నారు. ఏదో ఒక పాఠశాలలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొంటారన్నారు.

విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : పెంచిన విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌ఛార్జి కెఎం నాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, 2023 –24 సంవత్సరానికి సంబంధించి రూ.9,412 కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేయాలని ఇఆర్‌సి ఆదేశించడం దుర్మార్గమన్నారు. మద్యం ధర తగ్గించినట్లు గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగింపును వేగవంతం చేసిందని, దీంతో ప్రజలకు మరింత కష్టాలు తప్పవన్నారు. సమావేశంలో మాజీ ఆసుపత్రి జిల్లా డైరెక్టర్ మున్నూరు శ్రీను,పిల్లా రాజు, దొడ్డి హరి, మద్దాల సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని రావాడ గ్రామ పంచాయతీ ఎన్‌టిఆర్ కాలనీలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సిఫార్సులతో మంజూరైన రూ.35లక్షల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి గురువారం సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సారిపల్లి జోగి నాయుడు, మోటూరు సూరిబాబు, పొలవరపు సంజీవ రావు, మామిడి మురళీ, దొప్ప ముసిలినాయుడు, ద్వారపురెడ్డి లింగ రాజు, మరిసా శ్రీను, పల్లా నాగేష్, శీరా నాగేష్, కర్రి శ్రీనివాస్, పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి సిరి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదు

ప్రజాశక్తి -చోడవరం :రేషన్ బియ్యం అక్రమ రవాణాలో జిల్లాలో రైస్ మిల్లులు పాత్ర ఉందని సినీ నిర్మాత నటి కుమార్ అన్నారు. గురువారం చోడవరంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వెంకన్నపాలెం వాసవి రైస్‌మిల్లు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అనకాపల్లి డిఎస్‌పికి. ఫిర్యాదు చేసామన్నారు. అధికారుల కనుసన్నల్లోనే రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు. చోడవరంలో కొంతమంది రోడ్డు పక్క పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టి, వాటిని తప్పుడు సర్వే నెంబర్లతో విక్రయించారని, దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామన్నారు.ఈ వ్యవహారంలో పంచాయతీ అధికారుల పాత్ర ఉందని, వారిపై కేసు పెడతామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- నేటి నుంచి ప్రారంభం - స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :గ్రామస్థాయిలో భూమి తగాదాలు, రీ సర్వే అవకతవకలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సులను ఈనెల 6 నుండి జనవరి 8 వరకు నిర్వహించనున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. ప్రతి మండలంలోనూ రోజుకు ఒక గ్రామంలో జరుగుతాయన్నారు.తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ వీఆర్వో, మండల సర్వేయర్‌లు ఈ సమావేశాల్లో పాల్గొంటారన్నారు.ప్రతి మండలానికి డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారని అయ్యన్న అన్నారు. గత ప్రభుత్వంలో భూముల అక్రమాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటి ద్వారా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై డాక్యుమెంట్లు, ధరఖాస్తులు తీసుకురావాలని రశీదు ఇవ్వబడుతుందని చెప్పారు. 45 రోజుల్లో సమస్యల పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. సదస్సులు అనంతరం రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ టీం పరిశీలించి నివేదిక అందజేస్తుందని తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం మండలంలో ఈనెల 6 నుంచి రెవెన్యూ గ్రామసభలపై డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ షెడ్యూల్ విడుదల చేశారు. 6న పైడిపాల, 9న బూరుగుపాలెం, 10న తూటిపాల, 11న అప్పన్న పాలెం, 12న తామరం, 13న రాచపల్లి,16న కోడూరు, 17న గిడుతూరు, 18న వజ్రగడ, 19న కొండల అగ్రహారం, 20న భీమ బోయిన పాలెం, 21న చెట్టుపాలెం, 23న తూటిపాల, 24న నారాయణ గజపతిరాజుపురం, బయ్యవరం, 26న సీతన్న అగ్రహారం, 27న వెంకన్నపాలెం, 30న, జడ్.గంగవరం 31న మాకవరపాలెం, జనవరి 2న జి.గంగవరం, 3న మల్లవరం, 6న హరప్పా అగ్రహారం, 7న పిపి అగ్రహారం గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

నక్కపల్లి:రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ నరసింహమూర్తి కోరారు. మొదటి రోజు శుక్రవారం చిన రామభద్రపురం, దేవవరం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు.

బుచ్చయ్యపేట :మండలంలో ఈ నెల 6 తేదీ నుండి రెవిన్యూ సదస్సులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభిస్తున్నట్లు మండల తహసీల్దార్ఏం ఎం.లక్ష్మి గురువారం తెలిపారు. 6 న మంగళాపురం, 9న కేపీ. అగ్రహారం, కొండ పాలెం, 10న లాలూరు, లోపూడి, 11న బుచ్చయ్యపేట, 12న వడ్డాది, 13న కందిపూడి, 16న పొట్టిదొరపాలెం, నిమ్మలోవ, 17న పిపి.అగ్రహారం, కరక, 18న గున్నెంపూడి, 19న ఎల్బిపి అగ్రహారం, ఎల్.సింగవరం, 20న పి. భీమవరం, కొండెంపూడి, 21న విజయరామరాజుపేట, చింతపాక, 23న అయితంపూడి, పోలేపల్లి, 24న దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం, 26న గంటి కొర్లం, బట్లోవ, 27న కోమల్లపూడి, 28న తైపురం, చిట్టియ్యపాలెం, 30న చిన మదీనా,పెద్దమదిన, 31న ఆర్.శివరాంపురం, అప్పం పాలెం, జనవరి 2న రాజాం, నీలకంఠాపురం, 3న మల్లాం, మల్లం భూపతిపాలెం, 4న ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, 6న పెదపూడి పంగిడి, 7న తురకలపూడి తదితర గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

సబ్బవరం: మండలంలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ వెల్లడించారు. ఈనెల 6న అంతకాపల్లి, 7న గొల్లలపాలెం,9న బాటజంగాల పాలెం, 10న వంగలి, 11న అమతపురం, చింతగట్ల అగ్రహారం,12న అజనగిరి, 13న వెదుళ్లనరవ, 16న గంగవరం, 15న నంగినారపాడు,18న గుల్లేపల్లి, 19న ఆరిపాక, లగిశెట్టి పాలెం, 20న అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, 21న బోదువలస, 23న ఎల్లుప్పి,24న అయ్యన్నపాలెం, 26 ఇరువాడ, 27న పైడివాడ అగ్రహారం,28న సబ్బవరం, 30న బంగారమ్మ పాలెం,అడ్డూరు సిరసపల్లి 31న పైడివాడ,జనవరి 2న గొట్టివాడ, 3న గాలిభీమవరం, 4న నల్ల రేగులపాలెం, నారపాడు, 6న టెక్కలిపాలెం 7న రాయపుర అగ్రహారం, 8న మొగలి పురం గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు మండలం, జివిఎంసి పరిధిలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.రామారావు తెలిపారు. 6వ తేదీన ఎండిఒ కార్యాలయం, 9న చిట్టివలస, 10న దాకమర్రి, 11న జెవి.అగ్రహారం, 12న కొత్తవలస, 13న కాపులుప్పాడ, 16న కెవి భూములు, 17న ఆర్‌వై అగ్రహారం, 18న సంగివలస, 19న తాళ్లవలస, 20న తాటితూరు, 21న తగరపువలస, 23న అమనాం, 24న అన్నవరం 26న బోడమెట్టపాలెం, 27న చిప్పాడ, 28న రామయోగి అగ్ర హారం, 30న నిడిగట్టు, 31న నేరెళ్లవలస, 2025 జనవరి 2న టి.నగరపాలెం, 3న సింగనబంద, 4న మజ్జివలస, 6న చేపలుప్పాడ, 7న మూలకుద్దు, 8న నారాయణరాజుపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే సదస్సుల్లో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

ఆనందపురం : రెవెన్యూ సదస్సులలో అన్ని రకాల భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని తహశీల్దారు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ నెల 6న గొట్టిపల్లి, 9న గిడిజాల, 10న వేమగొట్టిపాలెం, 11న రామవరం, జిఎస్.అగ్రహారం, 12న దబ్బంద, 13న కనమాం, గోరంట, 16న ఎన్‌జిఆర్.పురం- 2, మామిడిలోవ, 17న ఎన్‌జిఆర్.పురం-2, శొంఠ్యాం, 18న భీమన్నదొరపాలెం, 19న కోలవానిపాలెం, 20న పాలవలస, 21న పందలపాక, బాకురుపాలెం, 23న గుడిలోవ, 27న తర్లువాడ, 28న చందక, 30న జగన్నాథపురం, 31న ముకుందపురం, పేకేరు, జనవరి 2న ఆనందపురం, 3న పెద్దిపాలెం, వెల్లంకి, 4న గండిగుండం, కుసులువాడ, 6న గంభీరం, 7న తంగుడిబిల్లి, ముచ్చర్ల, 8న శిర్లపాలెం, బోని గ్రామాలలో రెవెన్యూ గ్రామ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

మధురవాడ : మధురవాడ పరదేశిపాలెంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు విశాఖ గ్రామీణ తహశీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు.



కంప్యూటర్లు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట పంచాయితీ బోయపాడు ఎంపీపీ స్కూల్‌కు, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక హెటిరో డ్రగ్స్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో కంప్యూటర్లు సమకూర్చారు. గురువారం కంపెనీ ప్రతినిధులు ఎస్ కుల్లారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎన్.రాజారెడ్డి చేతుల మీదుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. సుమారుగా 2 లక్షల 50 వేలతో బోయపాడు ఎంపీపీ స్కూలుకు 2, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1 కంప్యూటర్లను అందజేసినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. కంపెనీ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి సూచనల మేరకు ఇప్పటికే పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. పాఠశాలల అభివృద్ధికి కంపెనీ యాజమాన్యం తోడ్పాటును అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ టీం ప్రతినిధి సిహెచ్ శ్రీనివాస్, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో గురువారం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన లేగ దూడల ప్రదర్శనను స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కిల్లాడ వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్య నిర్వాహక అధికారి డాక్టర్ బెహర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, లింగ నిర్ధారణ వీర్యం 60శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాధికారక సూక్ష్మ క్రిముల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రదర్శన పోటీలో గెలుపొందిన రైతులకు బహుమతులు, పాల్గొన్న రైతులకు మినరల్ మిక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిబాబు, టిడిపి నాయకులు భాస్కరరావు, స్థానిక పశు వైద్యురాలు హరిప్రియ, ప్రతాప్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దూడలను పరిశీలిస్తున్న నరేష్



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలో పలు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ సూర్యనాగేశ్వరరావు, ఏపీఓ ఈశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ, కుసర్లపూడి గ్రామంలో మెట్టపై వేసిన జీడిమామిడి తోటల్లో మొక్కలు ఇరువైపులా నీరు నిల్వ ఉండుటకు గోతులు తీస్తున్నారన్నారు. జానకిరాంపురం రామజోగయ్యబంద, అప్పయ్యదొర చెరువుల్లో పూడిక తీయడం జరుగుతుందన్నారు. ఎంపిడిఒ సూర్యనాగేశ్వరరావు రామజోగయ్యబందలో పని చేస్తున్న కూలీల మస్తర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్లూఎస్ అధికారి రమణ పాల్గొన్నారు.

గోకులం పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -రావికమతం:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గోకులం పశువుల షెడ్ల పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి క్లస్టర్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడి మణికుమార్ తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్డును గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఏపిడి మణికుమార్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా రెండు, నాలుగు, ఆరు, పశువుల షెడ్లను నిర్మించుకోవచ్చు అన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లకు కూడా షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. శాశ్వతంగా పశువుల షెడ్డు రైతుకు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పశువుల షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిని మొదట ప్రాధాన్యతగా ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దారిద్య రేఖకు దిగువున ఉన్నవారికి వీటిని మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇల్లులు నిర్మించుకున్న వారికి పేమెంట్ చెల్లించాలని తెలిపారు. జిల్లాలో రావికమతం మండలం ఉపాధి హామీ పథకంలో ముందంజలో ఉండాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని వాచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, హౌసింగ్ ఏఈ మురళీకృష్ణ, ఏపీఓ కాశి, ఈసీ కామేష్, టిఏలు కొండాజీ, రమణ, పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎపిడి



పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -గొలుగొండ:గొలుగొండలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యాంకుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం శీతాకాలంలో చర్మ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7 శనివారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, దాతలు హాజరు కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.నాగభూషణం కోరారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :

నేర్చుకోవాలనే ఆత్రుత, క్రమశిక్షణ, పట్టుదల మాత్రమే ఒక వ్యక్తిని ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని ప్రవాస భారతీయుడు, మైక్రోసాఫ్ట్ సాఫ్ట్వేర్ ఇంజనీర్, కరణం కన్నబాబు అన్నారు. దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి విచ్చేసి విద్యార్థులతో ముచటించారు. పేద కుటుంబంలో పుట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించిన అతన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సత్యారావు ఆహ్వానం మేరకు పాఠశాలను సందర్శించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. తన ఉపాధ్యాయులు చూపిన మార్గన్ని అనుసరించడంతో ఉన్నత స్థితిలో ఉండడానికి ప్రధాన కారణం అన్నారు ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు సన్మానం చేశారు.



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ కన్నబాబు

గతుకులు లేని రహదారులే లక్ష్యం

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- మాడుగుల: గతుకులు లేని రహదారులే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. సంక్రాంతి నాటికి మాడుగుల నియోజకవర్గంలో గోతుకుల రోడ్లు లేకుండా చేయడమే ధ్యేయమని తెలిపారు. గురువారం మండలంలో ఘాట్ రోడ్ జంక్షన్లో వడ్డాది నుండి తాటిపర్తి వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనుల శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, రోడ్డు భవనాల శాఖ చైర్మన్ నాగేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గెలిచిన ఆరు నెలల కాలంలోనే సుమారు 100 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. తాటిపర్తి సమీపంలో టూరిజం హబ్ నిర్మాణం చేయడానికి వచ్చిన తాజ్ గ్రూప్ కంపెనీ రోడ్లు సవ్యంగా లేక వెనుతిరిగారన్నారు. సంక్రాంతి నాటికి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసి టూరిజం హబ్ నిర్మాణం ఏర్పాటు చేస్తామన్నారు. 80 కోట్లతో పెద్దేరు రిజర్వాయర్లు పనులు జరుగుతున్నాయన్నారు. మాడుగుల మండలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం అవసరం ఉందని, ఆ స్థలం ఏర్పాటు చేస్తే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులకు సబ్సిడీపై 10 బ్యాటరీ కార్లు అందజేస్తామన్నారు. అనంతరం గొట్టిపాటి అగ్రహారంలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, ఎంపీపీ రాజారామ్, టిడిపి, జనసేన అధ్యక్ష కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేవుడు, గర్రెడ్డి శివాజీ, దాసరి అచ్యుతరావు ,నాయకులు పుప్పాల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే , కలెక్టర్



డ్రిప్ స్టింకర్లును ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- మాడుగుల: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సాగునీటి పథకం కింద రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పథకాలన్నింటిని సద్వినియోగపరచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కోరారు. గురువారం మాడుగుల మండలం ఘాట్ రోడ్డు జంక్షన్లో రైతులకు డ్రిప్ స్పింకర్లు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలో 18 ఎకరాలకు సంబంధించి డ్రిప్ స్పింకర్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆరుగురు రైతులకు పంపిణీ చేశామన్నారు. పలువురు రైతులు ఈ డ్రిప్ స్పింక్లర్ పైపుల నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారని వారందరికీ త్వరలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పివిజి కుమార్, గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఎంపీపీ రాజారామ్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కుమార్‌కు జ్ఞాపికను ఇస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్

వెంకన్న సన్నిధిలో పివిజి.కుమార్

ప్రజాశక్తి - మాడుగుల: రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా కేజె పురం జంక్షన్ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాపేటి రామకొండారావు మాస్టర్, కమిటీ సభ్యులు నాచు సునీల్ కుమార్ మెమొంటో అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి. భీశెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు, పరిమి కాసులు జగ్గారావు, తనకాల శివ, అదర్రావు శ్రీను, కొట్యాడ రఘుకుమార్ కర్రి సంతోష్, విశ్వ నాధ సుబ్బారావు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి- మాడుగుల: ఎం.కోడూరులోని మోదకొండ మ్మ ఆలయానికి అదే గ్రామానికి చెందిన పడాల సూర్యనారాయణ కుమారుడు, న్యాయవాది అప్పల నరసయ్య, పద్మావతి దంపతుల కుమార్తెలు యోగిత, భూమికలు వెండి వస్తువులను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకి అందించారు. బెంగళూరుకు చెందిన సాలూరు బాబా కృపానిది కుమారుడు శరత్ కుమార్ వెండిని విరాళంగా అందించారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జల్లి సూర్యప్రకాష్, పడాల అప్పలనాయుడు, అర్చకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యతో అవస్థలు



బావిలో నీరు తోడుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని అమలాపురం పంచాయతీ శివారు మూలపర్ర గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని మాజీ పంచాయితీ సర్పంచ్ భర్త సూరకాసుల గోవిందు, పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. 8 రోజుల నుండి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా నీరు సరఫరా నిలిచి పోయినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామంలో చేతిబోరు కూడా లేదని, బావులను ఆశ్రయించుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తాగునీరు సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



షూస్, ట్రాక్ ఇస్తున్న హెటిరో కంపెనీ ప్రతినిధులు

జాతీయ స్థాయి హాకీ పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: జాతీయస్థాయి హాకీ పోటీల్లోనూ క్రీడాకారులు రాణించాలని హెటిరో కంపెనీ ప్రతినిధులు ఆకాంక్షించారు. నక్కపల్లి హాకీ క్రీడా ప్రాంగణంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి హాకీ జట్టుకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు రాజారెడ్డి, ఎస్. ఎస్ కుల్లారెడ్డి, ఎమ్.ఎన్. ఎస్ సత్యనారాయణరెడ్డి హాజరై ముందుగా క్రీడాకారులను అభినందించారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్ సూట్, యూనిఫామ్, షూస్ అందజేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుండి 13 తేది వరకు మధ్య ప్రదేశ్ మాండాసూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జి.ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నరేష్, వేమగిరి నూకరాజు, బైరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు, కార్యదర్శి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

భర్తీ కాని సచివాలయ సిబ్బంది పోస్టులు

ప్రజాశక్తి -కోటవురట్ల: పందూరు సచివాలయంలో సిబ్బందిని భర్తీ చేయక పోవడంతో ఉన్న వారిపై భారం పడుతోంది. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు అట్టహాసంగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం పట్ల నాటి నుంచి నేటి వరకు సిబ్బంది కొరతతో పందూరు సచివాలయం నెట్టు కొస్తోంది. కొన్ని సందర్భాల్లో ఖాళీగా దర్శనమిస్తుంది. ఈ సచివాలయంలో కార్యదర్శి, మహిళ కానిస్టేబుల్, విలేజ్ సర్వేయర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక పోవడంతో ప్రభుత్వ పథకాల నమోదు, సమాచారంపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనేక సర్వేలు నిర్వహిస్తున్న తరుణంలో ఆ పని కూడా కష్టంగానే మారింది. ఆధార్ లింకు, స్కాలర్షిప్, సర్వేలతో పాటు రైతులకు వివిధ సేవలు అందించాల్సిన సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పోస్టులను భర్తీ చేయాలని గ్రామస్తులు, నాయకులు కోరుతున్నారు.



ఆన్‌లైన్ చేస్తున్న మహిళా పోలీస్

ఎక్సైజ్ సిఐగా రామకృష్ణ

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐగా వి.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన బి.మధుకుమార్ వి. మాడుగులకు బదిలీ కాగా భీమునిపట్నం నుంచి రామకృష్ణ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గొలుగొండ ఎక్సైజ్ పరిధిలోని నాతవరం, గొలుగొండ మండలాల్లో సారా నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. బెల్టు షాపుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఎక్సైజ్ సిఐ రామకృష్ణ

అగ్రిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం అగ్రికల్చర్ ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అగ్రిసెట్‌లో ప్రతిభ కనబరిచారు. పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న 16 మంది అగ్రిసెట్ పరీక్షకు హాజరు కాగా వారిలో ఐదుగురు అగ్రిసెట్ లో వివిధ ర్యాంక్ లతో ప్రతిభ కనబరిచారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో అగ్రికల్చర్ డిప్లమో పూర్తి చేసిన స్థానిక యువకుడు గుర్రం స్టీఫెన్ రాజ్ సహా మరో నలుగురు యువతులు అగ్రిసెట్ లో ప్రతిభ కనబరిచి ఏజీబీఎస్సీలో సీట్లు సాధించారన్నారు. చింతపల్లి మండలానికి చెందిన గుర్రం స్టీఫెన్ రాజ్ కు 11వ ర్యాంకు, గెడ్డం ఉమాలక్ష్మి ఎనిమిదవ ర్యాంకు, కంబిడి ప్రవల్లిక 27వ ర్యాంకు సాధించారని ఆయన తెలిపారు.

జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. పేర్కొన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులు చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ నుండి సబ్ కలెక్టర్లు, జాతీయ రహదారి అధికారులు, రహదారుల భవనాలు శాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై ఆరా తీసారు. 51ఇ రహదారి నిర్మాణంలో సమస్యలు లేవని, అందరికి చెల్లింపు చేయడం జరుగుతోందని జాతీయ రహదారి అధికారులు వివరించారు. రంప చోడవరం, చింతూరు డివిజన్లలో జాతీయ రహదారి 30లో చిన్న చిన్న సమస్యలున్నాయని కొద్దిరోజులో చెల్లింపులు పూర్తి చేస్తామని ఇంజనీరంగ్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు చెల్లింపులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ జాతీయ రహదారి, రహదారులు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు విస్తరించండి

పాడేరు: గిరిజన ప్రాంతంలో పోస్టల్ సేవలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ చెప్పారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో పోస్టల్ అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. 18 వేల మందికి ఇంకా ఆధార్ కార్డులు జారీ చేయవలసి ఉందన్నారు.



సిఎంతో బత్తుల తాతయ్యబాబు

సిఎంను కలిసిన బత్తుల తాతయ్యబాబు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: విశాఖ విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు మర్యాదపురం కలిశారు. ఈ మేరకు సిఎంకు ఘనంగా స్వాగతం పలి కారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి- హుకుంపేట: రహదారి నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మఠం జంక్షన్ ఆర్ అండ్ బి రోడ్డు నుండి మత్స్యగుండం ఆలయం వరకు రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులను గురువారం పరిశీలించారు.